
# రెక్కలొచ్చిన పక్షి

- జయంతి కావేరిమణి



తెలతెలవారుతోంది. కాలింగ్ బెల్ మ్రోగటంతో మెలకువ వచ్చింది. ప్రక్కనే కావలించుకొని పడుకున్న శ్రావణి ముఖం చూసి, దాని నుదుటిపై ముద్దుపెట్టి లేచాను. లేస్తూనే అలా చేయందే నాకు రోజు ప్రారంభం కాదు. టైం చూసుకున్నాను. పావు తక్కువ అయిదు. వచ్చిన పనివాళ్లని వరండాలో కూర్చోబెట్టి త్వరత్వరగా పది నిమిషాల్లో తయారై, ఇంటి నిర్మాణపు పని మొదలెట్టించాను.

'శ్రావణి, శ్రావణి లేమ్మా' అంటూ మధ్యలో వచ్చి మెల్లగా తట్టి లేపాను.

'ఏంటమ్మా, ఎందుకింత ఎర్లీగా లేపేస్తున్నావ్? నాకు నిద్ర వుంచుకొస్తోంది. ప్లీజ్,

నన్నొదిలెయ్యవా' ముద్దుముద్దుగా అంటూ నిండా ముసుగు వేసుకుని పడుకొంది.

'పిచ్చిపిల్ల పెళ్లయి అత్తారింటికి వెళ్తే' అన్న ఆలోచనకి నా గుండె ఆగినంత పనైంది. నవనాడులు బిగుసుకుపోయినట్లు అనిపించింది. గత ఇరవై రెండేళ్లుగా దాన్నే సర్వస్వంగా భావిస్తూ, దాని ప్రేమలో కాలం వెళ్లబుచ్చుతున్న నేను తనూ దూరం అయిపోతే, ఈ బ్రతుకు గాలిలో దీపంలా రెపరెపలాడిపోదూ. అందుకే ఆ ఆలోచన రానీయకుండా ఇన్నాళ్లూ ముందు చదువు, తర్వాత ఉద్యోగం, ఆ తర్వాతే పెళ్లి అని కాలయాపన చేసుకొచ్చాను.

నా అదృష్టం బాగుండి, నా స్వంత తమ్ముడే దీన్ని పెళ్లిచేసుకుంటానని, మాతోపాటు ఇక్కడే ఉంటానని ప్రామిస్ చేశాడు. కానీ శ్రావణి ఈ కాలం పిల్ల కదా. దాని మనసులో ఏముందో? అడిగితే దాని నోటివెంట, ఏ మాట వినాల్సి వస్తుందోనన్న భయం. అందుకే స్వతంత్ర భావాలు గల దాని దగ్గర నేనేనాడూ పెళ్లి ప్రసక్తి తీసుకురాలేకపోయాను.

తాపీమేస్త్రీ పిలుపుతో ఆ ఆలోచనల్లకి ఫుల్‌స్టాప్ పెట్టి బయటికి వెళ్లాను.

ఎనిమిది గంటలయింది.

'అమ్మా, శ్రావణీ లేమ్మా. ఆఫీసుకు టైం అవుతోందే. టిఫిన్ ఏం చేయమంటావ్. వంట ఏంచేసి పెట్టమంటావో త్వరగా చెప్పు' కిచెన్‌లోంచే గట్టిగా అరిచాను.

'ఏదో ఒకటి చేసి పెట్టేయమ్మా. నీకు ఇష్టమైనవే నాకూ ఇష్టం గదమ్మా' అంది లేస్తూ తనకేం కావాలో చెప్పకుండానే.

'అమ్మా! బి.పి. టాబ్లెట్ వేసుకున్నావా?' అడిగింది.

'లేదే, పని సందట్లో పడి మరిచిపోయాను. ఓ అరముక్క ఇలా తెచ్చిపెట్టు.'

'నీకెన్నిసార్లు చెప్పాలమ్మా! లేచి లేవగానే బ్రష్ చేసుకుని టాబ్లెట్ వేసుకోవాలని. నువ్వేమైనా చిన్నపిల్లవా? ప్రతిరోజూ చెప్పించుకోవడానికి. ప్రతీ చిన్న విషయానికి పెద్దగా ఆలోచిస్తూ బి.పి.ని పెంచుకుంటావ్. అలాంటప్పుడు మాత్రలు మింగొద్దు' ముద్దుముద్దుగా కోప్పడుతూ టాబ్లెట్ తెచ్చి నా నోట్లో పడేసింది.

తను అలా నన్ను దెబ్బలాట్టం, నా గురించి ఆలోచించటం నాకెంతో ఆనందాన్నిస్తుంటుంది. తల్లినై తొలినాళ్లలో తను నా గుండెలపైకెక్కి కేరింతలు కొడుతూ నన్ను కుమ్ముతున్న హాయిని గుర్తుకు తెస్తుంటుంది.

'అవునమ్మా, బయట ఏంటా చప్పుళ్లు' అడిగింది.

'బయట రెండు గదులు వేయిస్తున్నానే.'

'ఇప్పుడున్న ఈ రెండు గదులూ చాలవా చెప్పు.'

'తల్లీకూతుళ్లం ఇద్దరమే కాబట్టి ఏదోలా సర్దుకుపోతున్నాం. ఏమూడో మనిషి కాలుమోపడానికి ఆస్కారం ఎక్కడ వుందే. రేప్పొద్దున అల్లుడు, ఆ తర్వాత పిల్లలు తిరగాడాలంటే ఎలానే?' అందుకే చేయిస్తున్నా.

'నాకు చెప్పాపెట్టకుండానే' అంది.

'నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని'

'నిజమా!'

'మరో రెండు విషయాల్లో కూడా'

'ఏంటో చెప్పవా ప్లీజ్!' నా భుజాలు పట్టుకుని ముద్దుముద్దుగా అడిగింది.

'ముందు నువ్వు తయారవ్ చెప్తా' అంటూ కుక్కర్ పడేసి తనకిష్టమైన ఊతప్పం, అల్లం చెట్నీ తయారు చేయడం మొదలెట్టా.

శ్రావణి ఆఫీసుకి తయారైంది. పెద్ద పమిటంచు వసుంధరా శారీలో అరవిచ్చిన ముద్దమందారంలా వుంది. అక్కడే వుండి మరోసారి చూస్తే నా దిష్టే తగులుతుందేమోనని భయపడి, వడివడిగా కిచెన్‌లోకి వెళ్లి టిఫిన్ తెచ్చిపెట్టా.

టిఫిన్ చేస్తూ అడిగింది- 'ఏంటమ్మా, ఏదో సర్‌ప్రైయిజ్ చేస్తానన్నావ్?'

లోపలికెళ్లి రవ్వల నెక్లెస్ తెచ్చి ఇచ్చాను.

'నాకేనా?' అంది చారెడంత కళ్లు చేసుకుని విశాలమైన నవ్వుతో.

'నీకేనమ్మా' అన్నా.

'థాంక్సమ్మా. చాలా బాగుంది. మా మంచి

మమ్మీ' అంటూ గట్టిగా వాటేసుకుంది.

'ఆం చెప్పు నెక్స్‌ట్' అంది పట్టరాని ఆనందంతో.

'రేపు నీకు చినమామయ్యతో పెళ్లికి నిశ్చయం జరగబోతోంది' అన్నా ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయి.

'నాకా?' అంటూ బాధగా తలదించేసుకుంది.

విలవిల్లాడిపోయాను. 'నన్ను వదలి వెళ్లిపోతుందన్న బాధతో తను అలా అయివుంటుందనిపించింది. నన్ను వదిలి మామయ్యతో నువ్వెళ్లిపోనక్కర్లేదమ్మా. మామయ్యే తను ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఇక్కడికి వచ్చేస్తాడు. మనతోనే కల్సి ఉంటాడు. నన్ను ఒంటరిదాన్ని చేసి పోతున్నావన్న బాధా నీకుండదు. నిన్ను వదిలి ఉండలేని స్థితి నాకు కలగదు. సరేనా!'

'అది కాదమ్మా' అసహనంగా అంది.

'చెప్పమ్మా ఏంటి?'

'ఈ సంబంధం నాకిష్టం లేదు' తెగేసి చెప్పింది.

నా గుండెపై రాయి పడ్డట్టయింది. 'ఏం? ఎందుకని?'

'నేను మావయ్యని ఆ దృష్టితో ఎన్నడూ చూడలేదు. అదీకాక మేనరికాలు చేసుకోకూడదట' సముదాయింపుగా చెప్పింది.

'తప్పించుకొనే ప్రయత్నం చేయొద్దు. ఉన్నది ఉన్నట్టుగా చెప్పు' గర్జించాను.

'నేను, బావ ఒకర్నొకరు ఇష్టపడ్డాం. పెళ్లిచేసుకోవడానికి నిశ్చయించుకున్నాం' నిర్లజ్జగా సమాధానమిచ్చింది.

'ఆ బావెవడే?' అడిగాను అయోమయంగా.

'అత్త కొడుకు. అంటే నాన్నగారి అక్క కొడుకు. ఇక్కడే ఎల్. అండ్ టి.లో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. చాలా మంచివాడు. ఏ అలవాట్లు లేవు. అత్తయ్య కూడా చాలా మంచిది. నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటుందట. ఈమధ్య నాన్నగారు, అత్తయ్య కలిసి వచ్చారు. నాన్నగారు బాగా మారిపోయారు' కితాబునిస్తూ చెప్పింది.

'చాల్లే నీ కితాబు, నువ్వూను. ఆ సంబంధం నాకేమాత్రం ఇష్టం లేదు. అమ్మమ్మ, మావయ్య ఈ సాయంత్రానికి వచ్చేస్తారు. రేపే నిశ్చయాలు. వీలైనంత త్వరలో ముహూర్తాలు పెట్టించేస్తాను. ఇదే నా నిర్ణయం' ఎన్నడూ ఊహించని ఆగ్రహం వెళ్లగక్కాను.

శ్రావణి చెప్పాపెట్టకుండా బాక్స్ పట్టుకుని ఆఫీసుకి వెళ్లిపోయింది. నా మనసంతా కకావికలమైంది. అచేతనం ఆవహించి దుఃఖం ముంచుకొస్తోంది.

ఈ నాన్న, అత్త ఎందుకు దిగబడినట్టు? విసిరి పారేసిన పిల్లతో సంబంధం కలుపుకోవడంలో ఆంతర్యం ఏమిటి? ఆలోచిస్తున్న కొద్దీ మనసులో అశాంతి పేరుకుపోతున్నదే తప్ప స్థిమిత పడటం లేదు.

మాకు శ్రావణి ఏకైక సంతానం. పెళ్లయిన పదేళ్లకిగానీ శ్రావణి పుట్టలేదు. ఆడపిల్లను కన్నానని నన్ను తన ఇంటి గుమ్మం తొక్కొద్దన్నాడు అతగాడు. చాలాకాలం వరకు నన్ను తనింటికి తీసుకుపోలేదు. పెద్దలు, మధ్యవర్తులు


## 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

**పత్రిక విడిప్రతి : *5/-***
**ప్రత్యేక సంచిక (ఉగాది,దీపావళి) : *10/-***
**సాలుసరి చందా : *60/-***

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**
79బి, జర్నలిస్ట్సు కాలనీ,
జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.

నచ్చజెప్పారు. పర్యవసానంగా శ్రావణిని నా పుట్టింట్లోగానీ, అనాథ శరణాలయంలోగానీ ఉంచి, నన్ను రమ్మన్నాడు. నేను ససేమిరా అన్నాను. ఆ చంటి పిల్లను తీసుకునే ధైర్యంగా ఆ ఇంటికి వెళ్లాను. గొడవ చేసి, అల్లరిపెడితే ఈ వ్యవహారం పత్రికలకు, కోర్టుకి ఎక్కిస్తానని బెదిరించాను. అతగాడి మాట ఖాతరు చేయలేదని ఆ రోజు నుంచి నన్ను అనేక బాధలకు గురిచేశాడు. ఆ బాధల్ని భరించలేక కుమిలి కుమిలి ఏడ్చిన రాత్రులెన్నో. దానికీ గుర్తే. చాన్నాళ్లు దాని భవిష్యత్తు కోరే ఆ బాధలన్నింటినీ సహించాను. ఓర్పుకి, సహనానికి ఓ హద్దంటూ ఉంటుంది. ఆ ఓర్పు, సహనం కోల్పోయిన నాకు అతడితో విడిపోవడం తప్పనిసరి అయింది. భర్త నుండి విడిపోవడం వల్ల ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు నాకు తెలుసు. వాటిని గురించి నేను పట్టించుకోలేదు. నాకు శ్రావణి భవిష్యత్తు ముఖ్యం. దాని సుఖసంతోషాలు ముఖ్యం. అది ఎక్కడో అనాథగా ఉండిపోకూడదు. అలా విడిపోయిన నాకు ఒంటరితనం భారమవటంతో శ్రావణే నా సర్వస్వం అయింది. అలాంటిది దీని కోసం ఇల్లు వదిలి బయటికొచ్చేసిన నన్ను తను ఒంటరి చేస్తుందా? అంత విజ్ఞత లోపిస్తుందా? ఎన్నటికీ కాదు. కాస్తంత ధైర్యం కూడగట్టుకున్నాను.

అనుకున్న ప్రకారం అమ్మ, తమ్ముడు వచ్చేశారు. రేపు ఉదయాన నిశ్చయాలకు కావలసిన ఏర్పాట్లు చేసుకుంటున్నాం. తమ్ముడు షాపింగ్‌కి వెళ్లాడు. అమ్మా, నేను ఇంటి పనుల్లో మునిగిపోయాం.

'అమ్మాయ్! ఆరవుతోంది. ఇంకా శ్రావణి రాలేదేంటే?' అమ్మ అడిగింది.

'ఇక వచ్చే టైం అయింది, వచ్చేస్తుంది' అంటూండగానే ఫోన్ మ్రోగింది. వెళ్లి రిసీవర్ ఎత్తాను.

'అమ్మా! నేను శ్రావణిని. నేను బావ (అత్తయ్య) వాళ్ల ఊరు వెళ్తున్నాం' అని చెప్తుండగానే రిసీవర్ చేజారిపోయింది. మెదడు మొద్దుబారిపోయింది. అచేతనంగా ఉండిపోయాను. ❑

# ఒక తాతయ్య జ్ఞాపకం!

-నాదెళ్ళ అనూరాధ

బిడియపడ్తూ రాసిన మొదటి ఉత్తరానికి,
మొహమాటాలేం అక్కర్లేదు, నిక్షేపంలా రావచ్చునంటూ–
హిమాలయాల్ని అరచేతిలోకి తీసుకొచ్చిన ఆ పోస్ట్‌కార్డ్!
బొగడ చెట్టు పరిమళాల మధ్య ఆ పరిచయపు క్షణాలు!
ఆ ఇల్లు నేనెన్నడూ ఎరుగని తాతయ్యని నాకిచ్చింది!
ప్రపంచాన్ని చూడాలి, వినాలి, అర్థం చేసుకోవాలి అని చెబుతూ,
నా అజ్ఞానాన్ని ఓపిగ్గా భరిస్తూనే, మార్నింగ్ వాక్ పొడవునా
లోకరీతిని బోధించిన లౌక్యుడు!
మనసావాచా ఇంటికి తెచ్చుకున్న అమ్మమ్మ ఆఖరి క్షణాల్ని
దూరాన్నుండే మనోదర్పణంలో దర్శించిన అద్భుత ప్రేమికుడు!
జీవితమంతా పోరాటాన్నే ఊపిరి చేసుకుని,
వృద్ధాప్యపు అసహాయతలకీ లొంగనన్న పౌరుషవంతుడు!
గతి తార్కిక సిద్ధాంతాన్ని చెబుతూ, చెబుతూనే
ఒంటరి వాణ్ణయిపోయానంటూ చటుక్కున వెళ్ళిపోయాడు.